## క్లుప్తంగా

### ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



ఉండ్రాజవరంలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఉండ్రాజవరం: స్థానికంగా కొలువైన భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు శ్రీవైఖానస మహదాచార్య ఖండవల్లి సూర్యానారాయణార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణ క్రతువు నిర్వహించారు. అలయం వద్ద ఏర్పాటు చేసిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి స్వామి వారికి సంకల్పం, విశేష హోమం, సప్త కలశారాధన, ఉత్సవమూర్తి స్నపన తిరుమంజనం, ఆలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కల్యాణాన్ని తిలకించి, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నిడదవోలు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ ఎం. నాగభూషణం తెలిపారు. వివిధ శాఖల సమస్యలను ప్రజలు ఈ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకు రావచ్చునని ఆయన పేర్కొన్నారు.

### నిత్యావసరాల పంపిణీ

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల పాఠశాల (హృదయాలయం)కు ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్, బూరుగుపల్లి సత్యనారాయణ, వెంకట కృష్ణారావు, గోనెల వీర వెంకట సత్యనారాయణ, నిర్వాహకుడు దండే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించి వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ ఆదివారం తెలిపారు. కోరుమామిడికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఆరుగొలను పండు అనే యువకుడు ప్రేమిస్తున్నానని వెంటబడుతూ వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

### నేడు మాజీ మంత్రి వనిత జన్మదిన వేడుకలు

దేవరపల్లి: రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి తానేటి వనిత జన్మదిన వేడుకలను సోమవారం తాడేపల్లిగూడెంలోని ఆమె స్వగృహంలో నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్ తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

### హమ్మయ్య.. వాతావరణం చల్లబడింది

రాజానగరం: నైరుతి రుతు పవనాల రాకతో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి వేసవి ఎండల తీవ్రత నుంచి జనం కాస్త ఊరటపొందారు. ఆరుద్ర కార్తెలో కూడా రోహిణీ కార్తె మాదిరిగా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ తరుణంలో పలుచోట్ల వర్షాలు కురిసి వాతావరణంలో చల్లదనం ఏర్పడడంతో ఉక్కపోత నుంచి జనం కాస్త ఉపసమనం లభించినట్టుగా అనుభూతిని పొందుతున్నారు. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాలతో పాటు రోడ్లు కూడా జలమయమయ్యాయి. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, బీఎస్ఎన్ఎల్ ఎక్చేంజ్, సూర్యారావుపేట జంక్షన్ వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు పై వర్షం నీరు కాలువగా ప్రవహిస్తోంది.

# ఖరీఫ్ సాగుకు శ్రీకారం

- కొవ్వూరు డివిజన్‌లో 76.22 శాతం నారుమళ్లు పూర్తి
- 169 హెక్టార్లలో పూర్తయిన వరినాట్లు



కొవ్వూరు మండలం తోగుమ్మిలో వరి నారుమడి



కొవ్వూరు పట్టణ శివార్లలో నాట్లు వేసేందుకు దమ్ము చేసి సిద్ధం చేసిన పొలం

కొవ్వూరు: ఖరీఫ్ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. నైరుతి రుతుపవనాలు ఒకవైపు రైతులతో దోబూచులాడుతున్నాయి. బోర్లు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా దమ్ములు చేస్తున్నారు. మురగడ దమ్ము చేసి పొలంలో నీరు నిలగడుతున్నారు. మరోవైపు కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి మండలాల్లో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఖరీఫ్ వరినాట్లు మొదలయ్యాయి. కొవ్వూరు మండలంలో వెదజల్లు పద్ధతిలో నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు నాట్లు వేయగా మరో 78 హెక్టార్ల విస్తీర్ణంలో సాధారణ పద్ధతిలో నాట్లు వేశారు. నిడదవోలు మండలంలో 25, దేవరపల్లి మండలంలో 20, ఉండ్రాజవరం మండలంలో ఒక హెక్టారు, చాగల్లు మండలంలో 35 హెక్టార్ల విస్తీర్ణంలో ఇప్పటి వరకూ వరి నాట్లు పడ్డాయి. మరో నాలుగైదు రోజుల్లో వరి నారుమడుల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

| మండలం | సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో.. | పోయాల్సినవి | పోసినవి | శాతం |
|---|---|---|---|---|
| చాగల్లు | 3,484 | 174 | 174 | 100 |
| దేవరపల్లి | 3,718 | 186 | 110 | 59 |
| గోపాలపురం | 4,137 | 207 | 79 | 38 |
| కొవ్వూరు | 3,434 | 229 | 205 | 89 |
| నిడదవోలు | 7,235 | 365 | 300 | 83 |
| పెరవలి | 3,335 | 167 | 135 | 81 |
| తాళ్లపూడి | 3,832 | 192 | 140 | 73 |
| ఉండ్రాజవరం | 4,995 | 250 | 240 | 96 |
| నల్లజర్ల | 4,295 | 215 | 130 | 61 |
| మొత్తం | 38,465 | 1,985 | 1,513 | 76.22 |

ఈనెలాఖరు నాటికి అన్ని మండలాల్లోనూ ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. జూలై రెండో వారం నాటికి తొంభై శాతానికి పైగా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి పశ్చిమ డెల్టా కాలువకు నీటిని విడిచిపెట్టడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొవ్వూరు డివిజన్‌లో ఖరీఫ్‌లో 38,465 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతుంది. కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని ఎత్తిపోతల పథకాలకు ఇటీవల నీటిని విడుదల చేశారు. దీంతో ఎత్తిపోతల పథకాల ఆయకట్టు కింద వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా ఈ ఏడాది ఎంటీయూ 7029 (స్వర్ణ) వంగడం, పీఎల్ఏ –1100 రకం, ఎంటీయూ –1318, బీపీటీ– 5204 వరి వంగడాలతో పాటు ఎంటీయూ–1061, 1064, 1418, 1153,1156,1121 ఆర్‌పీ బయో (సంపత్ స్వర్ణ) తదితర రకాలను సాగు చేస్తున్నారు.

**తుది దశకు చేరుకున్న నారుమళ్లు**

కొవ్వూరు డివిజన్‌లో వరి నారుమళ్లు తుది దశకు చేరుకున్నాయి. డివిజన్‌లో 1,982 హెక్టార్లలో నారుమళ్లు పోయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,513 హెక్టార్లలో పోశారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా అడపాదడపా వర్షం కురుస్తోంది. దీంతో ఇప్పటికే 76.22 శాతం నారుమళ్లు పోశారు. చాగల్లు మండలంలో నూరు శాతం నారుమళ్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఇక మండలాల వారీగా కొవ్వూరులో 89, ఉండ్రాజవరంలో 96, నిడదవోలులో 83 శాతం చొప్పున నారుమళ్లు పడ్డాయి. తాళ్లపూడిలో 73, పెరవలిలో 81,నల్లజర్లలో 61, దేవరపల్లిలో 59 శాతం పూర్తి కాగా డివిజన్‌లో గోపాలపురం మండలంలో కనిష్టంగా 38 శాతం మాత్రమే నారుమళ్లు పోశారు. ఈ మండలంలో ఎక్కువ శాతం ఆయకట్టుకు వర్షధారం, చెరువులు, బోర్లుపై ఆధారపడడంతో ఇంత వరకూ ఆశించిన స్థాయిలో నారుమళ్లు పోయలేదు.

## బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: బీజేపీ మాతృ సంస్థ అయిన భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను ఆదివారం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక గౌతమీనగర్‌లో నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆధ్వర్యంలో 78వ బూత్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేత కోడూరి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖర్జీ బలిదానం రోజునే 370వ అధికరణం రద్దుకు అంకురార్పణ చేశారని ఆయనన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో అనేక అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ కో-కన్వీనర్ బీవీ ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, తాడిమళ్ల విజయవాణి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 23వ వార్డులోను బలిదాన్ దివస్ నిర్వహించారు. పిక్కి నాగేంద్ర, గంధ్రోతు పవన్, అడ్డూరి సత్యనారాయణ, గోపిశెట్టి శివ కృష్ణ, పోణంగి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణం



వడ్లూరులో ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సంస్థ మండల నూతన కార్యవర్గం

ఉండ్రాజవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయాలు నెరవేరేలా నూతన కార్యవర్గం పని చేయాలని మానవత సంస్థ జిల్లా ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీరామరాజు అన్నారు. మానవత సంస్థ మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం వడ్లూరు గ్రామంలోని సీతారామస్వామి కల్యాణ మండలంలో జరిగింది. 2023–24 సంవత్సరానికి మండల శాఖ అధ్యక్షుడిగా కఠారి సిద్ధార్థ రాజు, ఉపాధ్యక్షుడిగా వాకలపూడి రామకృష్ణ, కార్యదర్శిగా ఫణితిని పార్వతి, సంయుక్త కార్యదర్శిగా ఈడ్పుగంటి నాగేశ్వరరావు, కోశాధికారిగా కోడూరి శ్రీనివాసరావులతో పాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, బోయపాటి రామలక్ష్మి, తాతిన వెంకట కృష్ణారావు, ఎస్‌వీ సతీష్‌కుమార్, తన్నీడి సత్యనారాయణ, కడలి మాణిక్యాలరావు, వేలిచేటి బోసు, సర్పంచ్ రఘు మండ తేజశ్రీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు వేంద్ర అనంతలక్ష్మి, డాక్టర్ కె.సత్యనారాయణరాజు, వేగేశ్న నాగరాజు, అల్లూరి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చాగల్లు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాగల్లు: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ చిన్ననాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు పూర్వ విద్యార్థులు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1974–75 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని నెలటూరు సీతారామస్వామి కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కుటుంబ సభ్యులను మిత్రులకు పరిచయం చేశారు. 49 సంవత్సరాల తరువాత కలసిన తాము ఈ మధుర స్మృతులను జీవితాంతం పదిల పరుచుకుంటామని వక్తలు పేర్కొన్నారు. ప్రేమ, అనురాగాలు, ఆత్మీయతల కలయికగా దీనిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు, రిటైర్డ్ హెచ్ఎం పి.అనిల్‌కుమార్, ఆనాటి గురువులు రత్నబాల, బి.కృష్ణమూర్తి, జి.నాగేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులను ఘనంగా సన్మానించారు. గురువులు తమ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.ఈ అపూర్వ కలయిక కోసం బీఎస్ఎల్‌వీ ప్రసాద్, జి.బాపూజీ, జి.మనోహర్, ఎస్‌కేజే బాషా, ఏఆర్ఎస్‌బి ప్రసాద్, ఎన్. ఉమాదేవి, టి.వీరమాణిక్యం, ఎ.బేబీ సరోజిని, డి.సరస్వతి కృషిచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ భార్యాపిల్లలతోను, మనుమలు, మనుమరాండ్రతోను విచ్చేసి పాత మిత్రులతో ఆనందంగా గడిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

దేవరపల్లి: గోపాలపురం మండలం కొవ్వూరుపాడు గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గుడ్డిగూడెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు దొండపూడి మార్కెట్‌కు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియవలసి ఉంది.

### వరకట్న వేధింపులపై కేసు

కొవ్వూరు: రెండో భర్త తనను కట్నం కోసం వేధిస్తున్నాడంటూ పట్టణానికి చెందిన కంచుబాని శ్రీదుర్గ అనే వివాహిత పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణానికే చెందిన రెండో భర్త దినకరణ్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీదుర్గకు తొలుత 1991లో దొమ్మేరుకు చెందిన కృష్ణమోహన్‌తో వివాహం కాగా, ఇరువురి పరస్పర అంగీకారంతో వారిద్దరూ విడాకులు తీసుకున్నారు. తర్వాత శ్రీదుర్గ 2018లో దినకరణ్‌ను వివాహం చేసుకుంది. కొంతకాలం పాటు వారి కాపురం సవ్యంగానే సాగింది. అనంతరం అదనపు కట్నం తీసుకు రమ్మని దినకరణ్ తనను వేధిస్తున్నట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# 7 నుంచి జగన్నాథ రథోత్సవాలు

**దశావతారాల్లో దర్శనమివ్వనున్న స్వామివారు**

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామివారి ఆలయంలో వచ్చేనెల 7 నుంచి 17 వరకూ జగన్నాథుని రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో వలే చిన వెంకన్న దేవస్థానం కూడా వైభవంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన దారు విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. జగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 7న రథంపై స్వామి వారు లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. అలాగే ఉత్సవాల ముగింపు రోజు అయిన 17న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి రథయాత్రగా వెళ్లనున్నారు. రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో జగన్నాథ స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు. కావున భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.



లక్ష్మీపురంలో పురాతన జగన్నాథుని ఆలయం

**ఆలయ చరిత్ర ఇదీ**

శతాబ్ద కాలం నాటి ఈ ఆలయాన్ని ఒడిశా రాష్ట్రానికి చెందిన పూరీ వాసి, మఠాధిపతులైన మంత్రరత్నం అమ్మాజీ అనే లక్ష్మీ అమ్మవారు నిర్మించారు. అందులో వేంకటేశ్వర స్వామివారిని, అలాగే జగన్నాథస్వామి వారిని కూడా ఇదే ఆలయంలో ప్రతిష్ఠింపజేశారు. దీంతో ఒకే విమాన గోపుర శిఖరం కింద ఇద్దరు దేవతామూర్తులు కొలువై ఉండటం ఇక్కడి విశిష్టతగా పండితులు చెబుతారు. అప్పటి నుంచి కల్యాణోత్సవ, పవిత్రోత్సవాలతో కైంకర్యాలను మహా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ద్వారకా తిరుమలను ఎగువ తిరుపతిగాను, లక్ష్మీపురాన్ని దిగువ తిరుపతిగాను భక్తులు తలవడం పరిపాటిగా వస్తుంది. శ్రీవారి దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకున్న తరువాత మరింత అభివృద్ధి చేశారు. ఈ ఆలయంలో వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లతో పాటు జగన్నాథ స్వామి, బలరామస్వామి, సుభద్రాదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉన్నాయి.

**దశావతారాలు ఇలా..**

- 7న మత్స్యావతారం
- 8న కూర్మావతారం
- 9న వరాహావతారం
- 10న నరసింహావతారం
- 11న వామనావతారం
- 12న పరశు రామావతారం
- 13న రామావతారం
- 14న కృష్ణావతారం
- 15న కల్కి అవతారం
- 16న శ్రీ వేంకటేశ్వర స్వామి అలంకారం



యాత్రలకు ముస్తాబవుతున్న జగన్నాథుని రథం



ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల విగ్రహాలు



రథయాత్రల్లో ఊరేగనున్న సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు

### డ్రగ్స్ వాడకం పలు అనర్థాలకు మూలం

ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

కొవ్వూరు: డ్రగ్స్ వాడకంతో సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతున్నాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు అన్నారు. యాంటీ డ్రగ్స్ వారోత్సవ సభను ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహంలో నిర్వహించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు, డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలను ఆయన విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్‌ను కుంగదీసే మాదక ద్రవ్యాలను నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డ్రగ్స్‌కు బానిస లైతే కలిగే దుష్పరిణామాల గురించి ఆయన వివరించారు. హాస్టల్ వార్డెన్ ఆర్.చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణం



లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణకు బాధ్యత అప్పగిస్తున్న ఎమ్మెల్యే ఎం.వెంకటేశ్వరరావు

కొవ్వూరు: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గం కొవ్వూరు పరిసరాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం సాయంత్రం పట్టణంలోని యువరాజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మట్లాడుతూ రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలన్నారు. నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా నామన బుల్లిరాజు, కోశాధికారిగా నాళం వీర వెంకట శ్రీనివాసరావులతో లయన్స్ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పాలెంపాటి చినబాబు చౌదరి, క్లబ్ పూర్వపు అధ్యక్షుడు కలగర వెంకట్రావు, మన్యం బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.